CP 03C-189

దొంగలున్నారు! జాగ్రత్త!

రైలుబండి అర్థరాత్రి కారుచీకటిలోంచి, కారడవిలోంచి వెళుతూంది. శేషయ్యగారు ప్రయాణం చేస్తున్న ఇంటరు క్లాసు పెట్టె చాల చిన్నది. పెట్టెలో రెండో మనిషి లేడు. మీదనున్న రెండు లైట్లలోనూ ఒకటి వెలగడంలేదు. రెండవదికూడా కాంతివంతంగా లేదు. కిటికీలన్నీ వేసి శేషయ్యగారు బెంచీమీద నడుం వాల్చేరు

ఎదురుగుండా గోడమీద "దొంగలున్నారు జాగ్రత్త!" అని చదివేరు. ఆయన గుండె దడదడ కొట్టుకుంది. ఎవరేనా దొంగలున్నారేమో అని చుట్టూ ఒకసారి చూసి మళ్ళీ ధైర్యం తెచ్చుకున్నారు. రైలువాళ్ళకి సరిగా తెలుగుభాష రాదు. "దొంగలున్నారు జాగ్రత్త" అని వ్రాసుకుంటారా, ఎవరేనా? "దొంగ లుంటారు" లేదా "దొంగ లుండగలరు" అని వ్రాసుకోవాలి గాని. శేషయ్యగారు తనలోతాను నవ్వుకున్నారు.

ఈ సారి తను వచ్చిన పని జయప్రదమైంది. కలప కొనడంలో గొప్ప వ్యవహారజ్ఞానం వుపయోగించి బేరంలో రెండువేల రూపాయలు మిగిల్చేడు. రాయపూరు వెళ్ళి యీ సంగతి తన భార్యతో చెబితే ఎంతో సంతోషిస్తుంది. అవును మరి, దానికోసం, దాని పిల్లలకోసమేకదా ఈఆర్జన అంతాను.

గాలి వూపుకి కిటికీ అద్దం 'టపీ' మని పడిపోయింది. పరధ్యాన్నంగా వున్న శేషయ్యగారు ఒక్కసారి తృళ్ళిపడ్డారు. లేచి కూర్చుని కిటికీలోంచి చీకట్లోకి చూసి మళ్ళీ కిటికీ మూసి

వేశారు. తన ఒంటరితనం స్ఫురణకు రాగానే ఆయన కొక్క-సారి భయం వేసింది. తన మొలలో రెండువేల రూపాయలున్నాయి. ఇప్పుడెవడేనా వచ్చి యీ డబ్బుకోసం తన్నిక్కడ చంపితే తన పెళ్ళాం పిల్లల గతేమవుతుంది? ఆయన గుండెలు దడదడ కొట్టుకున్నాయి.

అయితే దొంగకు తనవద్ద రెండువేలున్నాయని ఎలా తెలుస్తుంది? రెండువేలేమిటి? యింకా ఎక్కువే వుండవచ్చునని వాడు అనుమానించడానికి అవకాశాలున్నాయి. తన జరీకండువా, చేతికి బంగారు వాచీ గొలుసు, వేళ్ళకు జిగ జిగ మెరిసే వుంగరం—ఇవి వాడి దృష్టి నాకర్షిస్తాయి. ఇవి తన కెంతో ప్రియమైన వస్తువులు; కాని తనకు ప్రమాదాన్ని తెచ్చిపెడతాయి. ఈ వస్తువుల కోసం డబ్బుకోసం వాడు తన్ను కత్తితో పొడిచి చంపవచ్చును. ఆయన కండువాతీసి మడతపెట్టి తలగడ క్రింద పెట్టేరు. వాచీగొలుసూ, వుంగరాలు చేతిరుమాలులో కట్టిలాల్చి పక్క జేబులో వేసుకున్నారు.

అయితే దగ్గర డబ్బున్నంతవరకూ దొంగభయం పోదు. "దొంగలున్నారు జాగ్రత్త!" అని ఎదురుగుండా వ్రాసి వున్న వాక్యం ఎంత తప్పించుకుందామన్నా కళ్ళబడుతూనే వుంది శేషయ్యగారికి. ఆయనకు మళ్ళీ భయం వేసింది. తన కిప్పుడేమిటి దారి? వచ్చే స్టేషనులో పోలీసులకు రిపోర్టుచేస్తే! అబ్బో, వాళ్ళెక్కడ! అనవసరంగా భయపడుతున్నావు పొమ్మంటారు. డబ్బుతో, విలువైన వస్తువులతో ప్రయాణం చేస్తున్న ప్రతివాడికీ రక్షణ యివ్వడానికి దేశంలోవున్న పోలీ

సులు చాలరని తోసిపారేస్తారు. అబ్బే, పోలీసువాళ్ళ సంఖ్య పెంచితేగాని భద్రత లేదు అనుకున్నారు శేషయ్యగారు.

శేషయ్యగారికి నిద్రపట్టడం లేదు. లేచి కూర్చుని చుట్ట వెలిగించారు.

రైలుబండి ఒక చిన్న అడవి స్టేషనులో ఆగింది. అబ్బ బయట ఏమి చీకటిగా వుంది అనుకున్నారు శేషయ్యగారు. మళ్ళీ బండి బయలుదేరే సమయంలో పెట్టెతలుపు తోసుకుని లోపలి కెవడో వచ్చాడు. బండి కదిలింది.

"ఒరే! దిగుదిగు, యీ పెట్టికాదు, ఇది పరువుల పెట్టి. దిగు! ఫో!" అని కేకలేశారు శేషయ్యగారు.

"అదేటి బాబయ్యా దిగమంటారు, బండికదిలిపోతేను, చావమంటారేటి, మంచోరే!" అని జాపోసుకుంటూ వాడు నేల మీద చతికిల బడ్డాడు.

"ఎవరు నువ్వు?" అని ప్రశ్నించేరు శేషయ్యగారు.

'ఎంకణ్ని బాబు.' అని జవాబిచ్చాడు వెంకడు.

వెంకడుట! వెధవ! జార్జిరాజులా వెంకడంటే లోక మందరికీ తెలిసినట్టు! శేషయ్యగారికి కోపం, చిరాకువచ్చాయి. అసలు ఆ వెధవ వాలకం చూస్తూంటే టిక్కట్టు లేని రకంలా కనిపించింది. తివాసీగుండూ, మొహంమీద కానీ అంత మచ్చ నల్లగా జీడిపిక్కలా వున్నాడు. వస్తాదులా మెడలో చిన్న ఆంజనేయుడి బిళ్ళ, జబ్బకి తాయెత్తు కట్టేడు. చిరిగిన బనీనూ, నిక్కరూ, కాళ్ళకి చిరిగిన కేన్వాసుజోళ్ళూ పాడూ పొట్టె బికారి వెధవలా కనిపిస్తున్నాడు. నేల కూర్చుని బీడీ వెలిగించాడు. ఏం నిర్లక్ష్యం! దొంగవెధవ! అనుకున్నారు శేషయ్యగారు.

వీడు నిజంగా దొంగేమోనని ఆయనకు అనుమానం కలిగింది. మరొక స్టేషను వచ్చేవరకూ వాడితో మెల్లిగామంచిమాటల్తో కాలంగడపాలి. లేకపోతే ఇలాంటి వెధవలు ఎంతపాపానికైనా వొడిగడతారు, అనుకున్నారు శేషయ్యగారు.

వాడు నేలమీద కూర్చుని బీడీలు కాలుస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. తరువాత మెల్లిగా జేబులోంచి డబ్బులు తీసి లెక్కపెట్టి, మళ్ళీ జేబులో వేసుకున్నాడు. బీడీ చివరి వరకూ కాల్చి, కిటికీలోంచి బయటికి పారేసి, 'తుబుక్కున' వుమ్మేడు.

"ఇప్పుడు టైమెంతవుతాది బాబు" అన్నాడు శేషయ్యగారి వైపు తిరిగి.

ఏవో మహారాచకార్యాలు చక్కబెట్టేవాడిలాగ యీ వెధవ కిప్పుడు టైమెందుకో? నిద్దరొస్తే పడుకోరాదూ అనుకుని "పది గంటలైందిరా." అన్నారు శేషయ్యగారు పన్నెండు గంటలైందని చెప్పడానికిష్టంలేక.

వాడేమీ మాట్లాడలేదు. తన పాతకెట్సుజోడు విప్పి, బండెక్కుతూన్నప్పుడు కొత్తగా చిరిగిన చిరుగును పరీక్షించి, మళ్ళీ తొడుక్కుని, బల్లకుచేరబడి. కాళ్ళుచాచుకుని 'సెలియా కనరావా!' అని యీలపాట ఎత్తుకున్నాడు. ఛీ! వొట్టి పోకిరి వెధవ!

"ఏవూరురా నీది?" అన్నారు శేషయ్యగారు.

"ఇజానగరం బాబు"

"ఎంతవరకు వెళుతున్నావ్?"

"రాయిపూరు"

"ఎందుకూ?"

"అక్కడ పనులు దొరుకుతాయని చెప్పినారు బాబు."

"ఎవరు చెప్పేసు?"

"ఎవరేటి, సాలమందంటారు బాబూ. అయినా ఎల్లినాక ఏదేనా దొరకదేటి?"

"టిక్కెట్టు కొన్నావా?"

"లేదు బాబు, రోజూ రైల్లో తిరిగేవానికి టిక్కెటేటి?"

"రోజూ ఎందుకు తిరుగుతావు? అసలు నువ్వేం పని చేస్తూ వుంటావు?"

"పనేటి బాబు! బిచ్చమెత్తుకుంటాను, అంతే"

"ఏం, రాయిలా వున్నావుగదా, ముష్టెత్తుకోడమేం? కూలి పని చేసుకోరాదూ?" అన్నారు శేషయ్యగారు. ఆయనకి ముష్టివాళ్ళంటే అసహ్యం. కాని, అంతమాత్రంచేత ఆయనకి ధర్మచింత లేదనడానికి వీలులేదు. ఆయ నప్పుడప్పుడు ఖైరాతీ సంతర్పణ చేయిస్తూ వుంటారు. ప్రేమ సమాజపోషకవర్గంలో సభ్యులు కూడాను. కాని, దుక్కలా వున్నవాళ్ళు కూలి చేసుకోవాలని ఆయన వాదన.

"దొరికితే ఎందుకు చేసుకోం బాబూ? దొరికినప్పుడు కూలీ సేసుకుంటాం. లేనప్పుడు బిచ్చమెత్తుకుంటాం" అన్నాడు వెంకడు.

"అసలు నువ్వు దుక్కలాగున్నావ్. నీకు ముష్టెవరు వేస్తారు?"

"అదే బాబు గొప్ప సిక్కొచ్చిపడింది. గుడ్డీ కుంటీ కయితే నాలుగుడబ్బులు దొరుకుతాయి. కాని, బాబూ నేను

మాత్రమేం తక్కువవాణ్ణేటి? అబ్బో! నేనసలే టక్కరిముండా కొడుకుని. నాలిక అంగుట్లోకి బిగబట్టేసి, మూగోడిలాగ ఏసమేసేస్తాను," అని వెంకడు తన ప్రయోజకత్వానికి తనలో తానే మెచ్చుకున్నట్లు చిరునవ్వు నవ్వేడు.

"ఈ రోజుల్లో వండుకునే వాడికంటె దండుకునే వాడి పనే బాగుందిరా. రోజల్లా కూలిపనిచేస్తే రూపాయి డబ్బులు దొరకడం కష్టమవుతుంది. ఇలా అయితే కష్టపడకుండా రోజుకి రెండూ మూడూ దొరుకుతాయి. ఏం?"

"అబ్బో! అంతపాపైతే ఇంకేం! రాజుగారి కోట నాటి దొకటి కట్టించేద్దును. ముష్టెత్తుకుంటే మాత్రం ఏటి దొరుకుతాది బాబయ్యో? ఒకడా, ఇద్దరా? సూడండిబాబూ గుడ్డీ, కుంటీ అంతా కలుపుకుని యీ బండికి పాతికమంది వుంటారు ఎదవలు. ఇంతమందిలో ఏటి దొరుకుతాదిబాబూ ? ఏదో పావలా, అర్ధా...అలాగే...ఒక్కొక్క పూట అదీ దొరకదు" అన్నాడు వెంకడు అగ్గిపెట్టికోసం నిక్కరుజోబు వెదుకుతూ.

"అయితే ఏమీ దొరకనప్పుడేమిటి చేస్తావు?"

"ఏదో వొకటి చేస్తాంగాని, పస్తుంటామా?"

"అదే, ఏమిటి చేస్తావూ అంట."

"ఏటి బాబు సాలస్మితం గడుగుతారు ఏటి బెమ్మాండ మేటి? ఒక జేబు కొట్టెస్తే సాలదా ? నాలుగు రోజులు జల సాగా ఎల్లిపోతాది. సరిగ్గా ఎయ్యాలిగాని బాబూ కాటుకు మించిన యిద్దేలేదనుకోండి!" అని చిరునవ్వునవ్వి, మళ్ళీ బీడీ

వెలిగించి, బాగా దమ్ముతీసి రైలింజనులాగ "గుఫ్, గుఫ్" మని పొగ వదిలాడు వెంకడు.

ఈసారి శేషయ్యగారి అనుమానం నిజమైంది. ఆయన గుండెలు దడదడ కొట్టుకున్నాయి. యీ వెధవ తన్ను చంపి తనడబ్బు పట్టుకుపోతే యిక్కడ దిక్కేమిటి? ఇదేం ఖర్మమో గాని పెట్టెలో రెండో మనిషి లేకపోవడమేమిటి? పోనీ ఎవడో రెండో మనిషి వచ్చాడనుకుంటే రాగారాగా దొంగ వెధవ రావడమేమిటి? ఇప్పుడేం చెయ్యాలి? అంతగా ప్రాణాలమీదికి వస్తే త[illegible]మొలనున్న రెండువేల రూపాయలూ సమర్పించి ఒక నమస్కారం చేసి వూరుకోవాలి! అంతకన్న చెయ్యగలిగిం దేముంది? ఛీ! అసలు బయలు దేరినప్పుడు ఎవరి మొహం చూశాడో గాని... అవునవును... తనుబయలుదేరుతుండగా పిల్లి కాళ్ళలో పడింది. శేషయ్యగారికి పిల్లిమీద కోప మొచ్చింది.

అయితే శేషయ్యగారు గొప్ప తెలివైనవారు. ఆయన తన మనసులో వుండే భయాన్ని కించిత్తుకూడా బయటపెట్ట లేదు. మీదు మిక్కిలి వెంకణ్ణి మంచిమాటల్తో లోంగదీసు కుని స్టేషను రాగానే పోలీసువాళ్ళకి అప్పజెప్పవచ్చు నను కున్నారు.

"అవును. నిజమేనురా వెంకయ్యా, ఏదో పని చేయక పోతే రోజులెలా గడుస్తాయి చెప్పు? అందుకే పెద్దలు కూటి కోసం కోటి విద్యలన్నారు. అయితే, ఒరే, ఎప్పుడేనా పట్టు బడ్డావా?"

వెంకడికి ఆశ్చర్యమేసింది. ఇంతవరకూ తనమీద తన తల్లీ, తను వొదిలేసిన పెళ్ళామూ తప్ప యింకెవ్వరూ సాను భూతి చూపలేదు. ఒకరిద్దరు సహచరులు తప్ప ఎవరూ తన వృత్తిని మెచ్చుకోలేదు. అందులోకీ చదువుకున్న వాళ్ళూ, శుభ్రంగా బట్టలేసుకున్న వాళ్ళూ, కామందులూ తన వృత్తి వల్ల తన్నెప్పుడూ అసహ్యించుకుంటారని వాడి నమ్మకం. అటువంటప్పుడు యీయన తన వృత్తిని సమర్థించడం వెంకడికి ఆశ్చర్యం కలిగించింది.

ఈ దొంగ వెధవ యింతకుముందెప్పుడూ పట్టుబడక పోతే మొట్టమొదటిసారి తన చేతుల మీదుగా పట్టుబడతాడనుకున్నారు శేషయ్యగారు. ఆయనమళ్ళీ అదేప్రశ్న వేశారు:

"అయితే ఏంరా వెంకయ్యా, యింతకుముందెప్పుడేనా దొంగతనంచేసి దొరికిపోయావా ?"

"ఎందుకు దొరకలేదు బాబూ, రెండుమూడు సార్లు ఖైదులోక్కూడా ఎళ్లేను"

"అయితే రెండు మూడు సార్లు ఖైదులో కెళ్ళినా దొంగపని మాత్రం వదిలి పెట్టలేదన్నమాట."

"లేదు బాబు, కొడవలికీ చిక్కనేదు, కొయ్యగూరకీ చిక్కనేదు"

"బాగానేవుంది కానీ, ఒరే వెంకయ్యా యీ వృత్తి చాల ప్రమాద కరమైందిరా. అందులో ప్రాణభయంకూడా వుంది. మాటవరసకి నాదగ్గరికి ఎవడేనా చెడుబుద్ధితో వచ్చాడనుకో, నా దగ్గర ఎప్పుడూ పిస్తోలు రెడీగా వుంటుంది. 'ధన్' మని కాల్చి పారేస్తాను. అంచేత నామాట విని యీ వృత్తి

వదిలిపెట్టి ఏదేనా పని చేసుకో. పోనీ నీకు రాయిపూరులో పనిప్పిస్తాను నాతో రా. తిండీ, బట్టా, వుండడానికి యిల్లూ కాక రోజుకొక రూపాయి డబ్బులు దొరుకుతాయి. ఏం చేస్తావా?" అన్నారు శేషయ్యగారు.

"ఓ, ఎందుకు సెయ్యను బాబూ, అలాగయితే నా నొగ్గేసిన ఆడదాయిని తీసుకొస్తాను బాబు."

"సరే అయితే" అన్నారు శేషయ్యగారు వెంకడి మొహంలోకి చూస్తూ.

వెంకడి మొహంలో సంతోషం కనిపించింది. వాడు తను వొదిలేసిన పెళ్ళాం గురించి ఆలోచిస్తున్నాడు. నిజంగా నరిసి చాల అమాయకురాలు. తను తిట్టినా, కొట్టినా ఎదురు తిరక్కుండా కుక్కలా పడివుంటుంది. నిజంగా తను ఎన్నిసార్లు దాన్ని చితకదన్న లేదు. అయినా తనంటే పడిచస్తుంది. నరిసికి తనెంతో అన్యాయం చేశాడు. దాన్ని మళ్ళీ తీసుకొచ్చి ఒక యిల్లూ సంసారం నడపాలనే కోరికలు వాడిలో వుద్భవించాయి.

ప్రస్తుతానికి వెంకడివల్ల కించిత్తు ప్రమాదంకూడా లేదని శేషయ్యగారికి ధైర్యం కలిగింది. ఆయన మహా మహా ఉద్దండులనే బుట్టలో వేసుకున్నాడు. ఈ వెధవ పీనుగ ఏ మాత్రం! లేకపోతే యింత వ్యాపారం వొంటిచేతిమీద ఎలా నడిపిస్తున్నాడు? ఏభై వేల రూపాయల ఆస్తి ఎలా చేశాడు? ఆయనకు యింకొక ఆలోచన తట్టింది. ఈ వెధవను దారిలో దింపేయడంకన్న వీడిని రాయిపూరువరకూ రానిచ్చి వీడిచేత సామానులు మోయించి తరువాత సావకాశంగా పోలీసు

వాళ్ళకు అప్పజెప్పవచ్చును. రాయిపూరు స్టేషనులో కూలీలు విపరీతంగా డబ్బు అడుగుతారు. అంతేకాదు. పీడు సామాను పట్టుకుంటే యింటికి నడిచి వెళ్ళిపోవచ్చును. లేకపోతే రెండో మూడో దండుగ అనుకున్నారు శేషయ్యగారు.

"ఒరే వెంకయ్యా. రాయిపూరు స్టేషనులో యీ సామాను పట్టుకుని నా వెనకాతల వెళ్ళిపోరా, నా బంట్రోతని చెప్పేస్తానులే. టిక్కెట్టు ఎవడూ అడగడు."

"అలాగేను బాబయ్యా, సామానుకూడా అట్టేలేదు. రెండు పెట్టెలు, పరుపు, యీ సజ్జ అంతేకద బాబు"

"రెండు పెట్టెలేవిరా, ఒకటేకదరా."

"రెండు బాబు, మీాద నొకటుంది. ఇదిగో యీ బల్ల కింద తోలుపెట్టె వొకటుంది" అన్నాడు వెంకడు.

శేషయ్యగారు ముందుకు వంగి తను కూర్చున్న బల్ల కింద వున్న తోలుపెట్టెని చూశారు. తోలుపెట్టె సరిక్రొత్తది! నిగనిగ మెరుస్తూంది! రెండు తాళాలు వేసివున్నాయి ఆయనకి ఆశ్చర్యమేసింది. ఈ పెట్టె తనదికాదు. ఎవరో యీ బల్ల కింద మరచిపోయారు. తనప్పుడే నాలుగైదు గంటలై ప్రయాణం చేస్తున్నాడు; ఎవరూ యీ పెట్టికోసం రాలేదు. ఆయన బుర్ర ఆలోచనలతో నిండిపోయింది. మెల్లిగా ఆ పెట్టెని ఎత్తి చూశారు. చాల బరువుగా వుంది. లోపల ఏమి విలువైన వస్తువులు పెట్టేరో తెలీదు. వెండి సామానులు, నగలు, డబ్బు,ఏమైనా వుండవచ్చును.

"ఏం బాబు అలా చూస్తున్నారు. మీాది కాదేటి?"

"నాదేనురా, మరచిపోయాను. మొన్న శనివారంనాడు విశాఖపట్నంలో 48 రూపాయలకు కొన్నాను ఈ తోలుపెట్టి."

"బాగుంది బాబూ, చదువుకున్నోరు గదా, మీ సామాను మీరే మరచిపోతారా ?" అని పకపక నవ్వేడు వెంకడు.

శేషయ్యగారికి పెట్టితీసి అందులో ఏముందో చూడాలనిపించింది. కాని ఎలాగ? తాళాలు విరగ్గొట్టాలి. వీడుంటూండాగా ఎలా విరగ్గొట్టడం? దొంగ వెధవ బాగా దాపరించేడు శనిలాగ అనుకున్నారు శేషయ్యగారు. ఆయన మళ్ళీ పెట్టి వేపు చూశారు. ఆహా! కొత్తపెట్టి! పెట్టే చేస్తుంది ఓ నూటాబై రూపాయలు! ఇంక పెట్టిలోని వస్తువులెంత విలువైనవో! ఎవరో ధనవంతులు మరచిపోయి వుంటారు! అంచేతే అంత నిర్లక్ష్యంగా వూరుకున్నారు. పెట్టి తీసి చూసినా బాగుండును! కాని ఎలాగ ?

వెంకడు శేషయ్యగారిని తదేకదీక్షగా పరిశీలిస్తున్నాడు. ఈ పెట్టి యీ షావుగారిదే అయితే అతనా పెట్టివేపు అలా చూస్తాడేం? ఎవడు మరిచిపోయాడో! పెద్ద బట్టలేసుకుని, డాబుగావున్న షావుకారు కాబట్టి ఇది తనదే అంటే ఎవరూ అనుమానించరని వాడి ధైర్యం! నిజమే! ఎవరనుమానిస్తారు? అయితే తనుకూడా దగా పడతాడా? వెంకడు బాగా ఆలోచిస్తున్నాడు.

వెంకడు తన వేపు చూస్తున్నాడని శేషయ్యగారు గ్రహించి, ఏమీ ఎరగనట్టు తలగడా కిందనుంచి దాశరథీ శతకం తీసి పద్యం గట్టిగా ఎత్తుకున్నారు.

బండి ఒక చిన్న స్టేషనులో ఆగింది. ఈ వెధవ నెలాగైనా యిక్కడ దింపేస్తే బాగుండుననుకున్నారు శేషయ్యగారు. అంతట్లో టిక్కెట్టు కలక్టరు తలుపుతోసుకుని లోపలికొచ్చాడు. టిక్కెట్టు కలక్టరు నిద్రమత్తుచేతనో ఏమోగాని కొంచెం తూలుతున్నట్టు కనిపించేడు. కొంచెం కోపంగా వున్నాడు. వెంకణ్ని చూసి 'ఎవడ్రా నువ్వు' అన్నాడు చిరాకుగా,

"మూగి ఎంకణ్ణి బాబూ."

"దిగు వెధవా! నీ బాబుగారి బండిలా ఇంటరులో కూర్చున్నావ్, దిగు" అన్నాడు.

"సిత్తం బాబు" అని వెంకడు బండిదిగి ప్లాట్ఫారం మీద నిలబడ్డాడు. శేషయ్యగారు 'అమ్మయ్య' అని నిట్టూర్పు విడిచేరు. టిక్కెట్టు కలక్టరు శేషయ్యగారి టిక్కెట్టు పరిశీలించి తరవాత సామాను చూసేడు. టిక్కెట్టుమీద తీసుకువెళ్ళ గలిగిన దానికంటె ఎక్కువ బరువు వుందని అతను తూకాలూ లెక్కలూ వేసి నాలుగు రూపాయల ఆరణాలు అదనంగా చార్జీ చేశాడు. శేషయ్యగారు తడుముకోకుండా డబ్బుతీసి యిచ్చారు. ఇంత విలువైన పెట్టె దొరికినప్పుడు యీమాత్రం రైలుచార్జీ యివ్వడంలో నష్టమేముంది? టిక్కెట్టు కలక్టరు దిగి వెళ్ళగానే బండి కదిలింది. మళ్ళీ తలుపు తోసుకుని వెంకడు లోపలికి వచ్చాడు.

శేషయ్యగారికి వాడినిచూడగానే చిరాకేసింది. వెధవ, ఏలినాటి శనిలాగ పట్టుకు వదలకుండా వున్నాడు.

వెంకడు నేలమీద చతికిలబడి, బీడీ వెలిగించి రెండు దమ్ములు తీసేడు ఈసారి ఎడ్ల రామదాసు తత్వం మెల్లిగా ఎత్తుకున్నాడు.

"బాబూ, అయితే యిందులో ఏటి పెట్టినారు బాబూ, ఆడు సార్జి సేసినాడు? కాసింత బరువైతే ముండాకొడుకు లూరుకోరు!" అని వెంకడు శేషయ్యగారికళ్ళలోకి చూశాడు. శేషయ్యగారి కళ్ళలో కొంచెం గాభరా కనిపించింది.

"అబ్బే, ఏమీలేదురా... మాలాంటి వాళ్ళ దగ్గర ఏముంటుందోరే?... ఏవో నాలుగు బట్టలూ, ఏదో రామా, కృష్ణా అనుకోడానికి నాలుగు పుస్తకాలూ...ఏమిటుంటాయి చెప్పు ?"

"గొప్ప ఇలవైన బట్టలే అయివుంటాయి. అంచేతే అంత బరువు!" అన్నాడు వెంకడు పెంకితనంగా.

"అబ్బే, లేదురా, మామూలుగా కట్టుకునే బట్టలే. అయితే అంత బరువెలా అయిందంటావా? మా బావమరిది వైద్యుడొక డున్నాడులే..."

"ఎక్కడ, యీ పెట్టిలోనా?" అన్నాడు చటుక్కున వెంకడు శేషయ్యగారి మాట పూర్తి కానివ్వకుండా.

"పూర్తిగా చెప్పనియ్యరా మరి! మాట కడ్డొస్తా వేమిటి? మా బావమరిది మా వూళ్ళో వున్నాడు, పెట్టెలో ఎందుకుంటాడు? తెలివి తక్కువ మాటలాడకు విను. వాడు చాల మంచి వైద్యుడు. మందులు నూరుకోడానికి రాతికల్వం ఒకటి తెమ్మని వాడు బతిమాలేడు. విశాఖపట్నంలో కొన్నాను. కొంచెం పెద్దదే. అంచేతే వెధవ కల్వం అంత బరువు. కాని,

ఏంచేస్తాం మరి?" అన్నాడు శేషయ్యగారు. తన సమయస్ఫూర్తికి తనలో తాను సంతోషించారు.

వెంకడు 'హీ, హీ, హీ!' అని నవ్వేడు. "రాతికల్వాం అంత మంచిపెట్టిలో బంగారంనాగ ఎట్టినారుబాబూ" అంటూ వెంకడు మరో బీడీ అంటించాడు.

శేషయ్యగారు ముఖం చిట్లించి, సీరియస్‌గా దాశరథీ శతకం మళ్ళీ తీశారు. కాని మనసులో ఏదో భయం పీక్కుతింటూంది. తను నిష్కారణంగా యీ చిక్కులో పడ్డాడు. ఇందాక టిక్కెట్టు కలక్టరు వచ్చినప్పుడు వెంకడి గురించి చెప్పి పోలీసుల కప్పజెప్పవలసింది. చాల పొరబాటయింది. ఆయన కిప్పుడు వెంకణ్ణిచూస్తే భయం వేస్తూంది. ఈ దొంగ వెధవ తన సంగతి కనిపెట్టినట్టుంది! ఏమిటి దారి?

వెంకడికి సర్వమూ అర్థమైంది. ఇంత అనుభవమున్న తన కళ్ళలోనే దుమ్ముకొట్టేడు యీ షాహుకారు. అబ్బో! మంచి ఘనమైన దొంగలాగే వున్నాడే అనుకున్నాడు వెంకడు. అయితే పాపం యీ షాహుకారికి అనుభవం లేక యింతసేపూ మాటల్లో అలా పల్టీలు కొట్టేడు అనుకుని తనలో తను నవ్వుకున్నాడు వెంకడు.

తన్నింతసేపూ మోసంచేసినందుకు వాడికి శేషయ్యగారి మీద కోపం వచ్చింది. ఇంకో స్టేషను రాకమునుపే తనా పెట్టి పట్టుకుని బండి దిగిపోవాలి! అందులో ఎంత డబ్బువుందో! నగలో, ఖరీదైన వస్తువులో ఏమిటున్నాయో, యీ షాహుకారి కెందుకు వదిలిపెట్టాలి? చేతికి చిక్కింది చూస్తూ చూస్తూ ఎందుకు జారవిడుచుకోవాలి?

వెంకడు లేచి నిలబడి, మొలలోని కత్తితీసి, శేషయ్య గారి గుండెల మీద పెట్టేడు.

శేషయ్యగారు త్రుళ్ళిపడ్డారు. "అమ్మ బాబోయ్! దొంగ, దొంగ !" అని కేక వేశారు

"ఇదిగో సెబుతున్నా ఇదుగో. కేకేసినా, లెగిసినా, పొడిసేస్తాను తెలిసిందా. నాతోటి ఏసాలుమానీ. మా గెంకడి తడాఖా నీకేటి తెలుసు!"

"ఒకే నాయనా! చంపకురా, నీ పుణ్యముంటుందిరా! నీకేమిటి కావాలో పట్టుకుపోరా బాబూ. పిల్లలగలవాణ్ణిరా" అని మొరపెట్టేరు శేషయ్యగారు. ఆయన భయంతో గజగజ వణుకుతున్నారు.

"నిన్ను సంపకపోతే నువ్వు నన్నొగ్గేస్తావేటి? పిస్తోలేసి కాల్చేస్తావు."

"లేదురా నాయనా, నా దగ్గర పిస్తోలు లేదురా. ఒట్టినే సరదా కన్నానురా, చంపకురా" అని ఆయన ప్రాధేయపడుతూంటే వెంకడు రెండో చేత్తో బెడ్డింగు తాడులాగి ఆయన రెండు చేతులూ కట్టేశాడు. ఇంకాయన పిస్తోలు పేల్చడం అసాధ్యం. ఎందుకైనా మంచిది, ఎక్కడేనా పిస్తోలుందేమోనని వెదికాడు వెంకడు. కాని ఎక్కడా లేదు.

"ఇదిగో ఎవరితో నేనా సెప్పినావంటే సచ్చూరుకుంటావ్ తెలిసిందా?" అంటూ వెంకడు, బలకింద తోలుపెట్టె తీసి చేత్తో పట్టుకుని తలుపు దగ్గర నిలబడ్డాడు.

ఏదో స్టేషను సమీపిస్తోంది కాబోలు బండి వేగం తగ్గింది. ఒక చేత్తో తోలుపెట్టె పట్టుకుని, మరో చేత్తో తలుపు

తీసి గుమ్మం దగ్గర నిలబడి దిగిపోవడానికి వెంకడు సమయం కోసం చూస్తున్నాడు.

శేషయ్యగారు మెల్లిగా లేచి బండి గొలుసు లాగి, మళ్ళీ యథాప్రకారం పడుకున్నారు. గుమ్మం దగ్గర నిలబడి చీకట్లోకి చూస్తున్న వెంకడు ఇది గమనించలేదు.

బండి వేగం బాగా తగ్గిపోయింది. వెంకడు బండిదిగి పొలాల్లోకి నడక ప్రారంభించాడు. బండి నిలబడి పోయింది. శేషయ్యగారు గోలచేస్తూ కట్లతో వున్న చేతులు చూపిస్తూ 'దొంగ, దొంగ పట్టుకోండి' అని వెంకడు వెళుతూన్న వేపు వేలు పెట్టి చూపించారు. బండిలోవున్న యిద్దరు ప్రయాణీకులు పరుగెత్తి వెంకణ్ణి తరిమి తరిమి పట్టుకుని తీసుకొచ్చారు.

బండిలో ప్రయాణీకులూ, రైలు గార్డూ అంతా శేషయ్యగారి మీద సానుభూతి చూపించేరు. శేషయ్యగారు అందరి గుండెలు కరిగిపోయేలాగ గుండెలు బాదుకున్నారు "అయ్యో, కొత్త తోలు పెట్టండీ, అరవైరూపాయలిచ్చి కొన్నానండీ వదలకండి, వెధవని పోలీసుల కప్పజెప్పండి" అని శేషయ్యగారు గోలపెట్టేరు.

"దొంగ వెధవా, పారిపోదామనుకున్నావా" అని ప్రయాణీకులు వెంకణ్ణి నాలుగు తాపులు తన్నేరు.

"ఈ పెట్టి ఆడిదా ఏటి, అడగండి బాబూ అందులో ఏటుందో'' అని వెంకడు ఏదో చెప్పబోయాడు.

"చూశారా. యీ దొంగ వెధవ మాటలు! తన్నండి వెధవని" అని శేషయ్యగారు కళ్ళ నీళ్లు తుడుచుకున్నారు.

"తన్నండి వెధవని" అన్నారు ప్రయాణీకులు.

"కాళ్ళూ చేతులూ కట్టి బండిలో పడేయండి. వచ్చే స్టేషనులో పోలీసుల కప్పజెబుదాము" అన్నారు గార్డుగారు.

"ఈ వెధవ ఎన్నిసార్లు వెళ్ళేడో జైలుకి. వాడికి లక్ష్యమా ఏమిటి. నాలుగు తన్ని వదిలేండి" అన్నా రొకరిద్దరు ప్రయాణీకులు.

అందరూ తలో జెల్లా కొట్టేరు. ఎవ డిష్టమొచ్చినట్టూ వాడు తన్నేడు. "ఛో! వెధవా, అదృష్టవంతుడివి బతికి పోయావు ఫో" అని వాడిని వదిలేశారు. బండి బయలు దేరింది.

"శేషయ్యగారు ఒక నిట్టూర్పు వదిలారు. శని విరగ డైంది. ఇంక తోలుపెట్టెకేసి చూడవచ్చును. అయితే మరో రెండు స్టేషన్లు దాటితే రాయిపూరు వచ్చేస్తుంది. హాయిగా యింటికి వెళ్ళి చూసుకోవచ్చు ననుకున్నారు మళ్ళీ.

శేషయ్యగారు రాయిపూరు స్టేషనోదిగి సామాను గుర్రపు బండిలో వేసుకుని యింటికి వెళ్ళేరు.

శేషయ్యగారు విజయగర్వంతో యింట్లో అడుగు పెట్టేరు. సామాను దింపించి, బండివాడికి డబ్బులిచ్చి పంపించిన తరువాత తను తీసుకొచ్చిన పిప్పరమెంట్లు పిల్లలకిచ్చేరు. భార్య లోపలి గుమ్మం దగ్గర నిలబడి భర్తవేపు చూస్తూంది. అమాయకురాలు ఆవిడకేం తెలుసు తనుసాధించిన విజయం గురించి? తనతో యిన్నాళ్ళయి కాపరం చేస్తూంది కాని ఆమెకు తన సామర్థ్యం గురించీ, తనవ్యవహారజ్ఞానం గురించీ ఏమీ తెలీదు. తన ప్రయోజకత్వాన్ని ఆమె గుర్తించలేదు. పాపం, చాల అమాయకురాలు. ఈ పెట్టెను గురించి ఆమెతో ఏమని చెప్పాలి? ఏమని చెబితే ఆమె సంతోషిస్తుంది. నిజం చెబితే

యిది తప్పు పనిగా భావించదు కద? ఇన్నాళ్ళయి కాపరం చేస్తున్నా తను భార్య మనస్తత్వాన్ని గురించి నిర్ణయించుకోలేక పోతున్నందుకు తనమట్టుకు తనకే విచారమేసింది శేషయ్యగారికి.

ఈ పెట్టి గురించి ఆమెతో చెప్పకూడదు. పెట్టి తాళాలు తీసి, అందులోని వస్తువులను ఆమెకు చూపించి ఆశ్చర్యం కలిగించాలి అనుకున్నారు శేషయ్యగారు. చాల ఆకలిగా వుందనీ వంట వేగం కానీయమనీ భార్యకు పురమాయించి తోలుపెట్టి తీసుకుని తన గదిలోకి వెళ్ళి గది తలుపులు మూసివేశారు శేషయ్యగారు.

తాళం కప్పలు చాల మంచివి. వాటిని విరగ్గొట్టి పాడు చెయ్యడ మెందుకని తన దగ్గరవున్న తాళాలగుత్తి తెచ్చి అన్ని తాళాలతోనూ ప్రయత్నించి చూశారు. కాని అవి లొంగలేదు. ఎవరో పాపం గట్టికప్పలే వేసుకున్నారు. వీటినింక బలవంతంగా విరగ్గొట్టడం తప్ప మరి మార్గాంతరం లేదు. డ్రాయరులోంచి పటకారుతీసి తోలుపెట్టి తాళాలు విరగ్గొట్టేరు.

ఆయన గుండెలు జోరుగా కొట్టుకుంటున్నాయి. చేతి వేళ్ళు వణకుతున్నాయి. పెట్టి తలుపు తీశారు. మీద తెల్లటి పంచమడతవుంది. ఏమిటి, ఎవరిదీ పెట్టి? తనకెలా వచ్చింది? తను చేసింది మంచి పనేనా; కాదు, ఇది దొంగపని. అయితే ఎందుకు చేశాడు. దీన్నిగురించి ఎందుకింత తాపత్రయ పడ్డాడు? తనకీ వెంకడకీ ఏమిటిభేదం? నిజంగా వెంకడు నిజాయితీపరుడు. తన వృత్తి దొంగతనమని స్పష్టంగా నిర్భయంగా చెప్పేడు. ఈ పెట్టి దొంగిలించినట్టు ఒప్పుకొన్నాడు. ఈ పెట్టిని దొంగి

లించే హక్కు వాడికి లేకపోవచ్చును. అయితే వాడికి లేని హక్కు తనకు మాత్రమెలా వచ్చింది? చివరికి అంతా వాడిని నిందించారు, శిక్షించారు. పాపం వెంకడికి తను అన్యాయం చేశాడు? అయితే లోకంలో పాపాలు చెయ్యనివాడెవడు? ఏమిటో పిచ్చిగాని! ఆలోచనలతో ఆయన బుర్ర బరువెక్కిపోయింది. మనసులో అశాంతి వ్యాపించింది. వాటినివదిలించుకుని తేలికపడదామని ఆయన గట్టిగా ఒకసారి నవ్వి పెట్టెలో చెయ్యిపెట్టి ఆత్రంగా తడిమేరు. రెండో చేత్తో పెట్టెలో మీదనేవున్న పంచ మడత తీసి పారేశారు.

శేషయ్యగారి ఒళ్ళు ఝల్లుమంది. శరీరమంతా చెమట పట్టింది. చూడలేక తువ్వాలుతో మొహం కప్పుకున్నారు.

లోపల బొడ్డుకోయని పసిబిడ్డ దీర్ఘనిద్రలో వుంది.

(అఖిల భారత పోటీలో ద్వితీయ స్థానం పొంది,
ప్రపంచ కథానికల పోటీకి పంపబడిన కథ)